సాక్షి
ములుగు
శనివారం । 27 । జనవరి । 2024



16 కిలోల గంజాయి స్వాధీనం

కాజీపేట రైల్వే జంక్షన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తి వద్ద 16కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. - 8లో▸



బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడి

మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో బెల్ట్‌షాపులపై దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33.8^0 / 17.4^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ కాస్త చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

'దేవస్థానం అధికారుల కుల వివక్ష'

కాళేశ్వరం: శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానంలో కార్యక్రమాల సమాచారం తమకు ఇవ్వకుండా కుల వివక్షకు గురిచేస్తున్నారని కాళేశ్వరం ఎంపీటీసీ రేవెల్లి మమత ఈఓ మహేష్‌తో స్వల్ప వాగ్వాదానికి దిగారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జెండా వందనం తర్వాత ఈఓతో ఎంపీటీసీ మాట్లాడుతూ దేవస్థానం అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా కులవివక్షకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయమై దేవదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈఓ మరోసారి జరుగకుండా చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. వారిద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం జరగడంతో గణతంత్ర వేడుకల్లో చర్చనీయాంశంగా మారింది.

రక్తదాన శిబిరం



టేకుమట్ల: గణతంత్ర దినోత్సవ సందర్భంగా మండలకేంద్రానికి చెందిన ఫిజియోథెరపీ వైద్యులు కొలుగూరి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 38మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు అక్షయ్, ఎల్‌టీ శ్రీకాంత్‌గౌడ్, సంధ్య, స్టాఫ్ నర్సులు నవలోక, సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

అవిశ్వాసంపై సమావేశం

భూపాలపల్లి రూరల్: గణపురం సహకార సంఘం చైర్మన్ పోరెడ్డి పూర్ణచందర్‌పై పాలకవర్గ సభ్యులు అవిశ్వాస తీర్మానానికి ప్రతిపాదించినట్లు జిల్లా సహకార అధికారి డి.శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 5వ తేదీన ఉదయం 11గంటలకు గణపురం సహకార సంఘం కార్యాలయంలో పాలకవర్గం సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు నోటీసులు జారీచేశారు.

మెస్‌చార్జీలు విడుదల చేయాలని నిరసన



కాటారం: ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం మండలకేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్మరన్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలు విడుదల చేయకపోవడంతో హాస్టల్ వార్డెన్లు అప్పులు చేసి హాస్టళ్లు నడపుతున్నారని చెప్పారు. ప్రభుత్వం మెస్ చార్జీలు విడుదల చేసి మెస్‌చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. హాస్టళ్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న జరిగే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ రథయాత్ర



భూపాలపల్లి రూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాజ్యాంగం మొదటి పేజీ పీఠికను ప్రజలకు తెలియజేసే విధంగా ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకులు కొత్తూరి రవీందర్ ఆధ్వర్యంలో రథయాత్రను ప్రారంభించి భూపాలపల్లి పట్టణంలో వాడవాడలా ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో రథయాత్రను ప్రారంభించి రాజీవ్‌నగర్, కృష్ణ కాలనీ, సుభాష్ కాలనీ, మెయిన్‌రోడ్ మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి రతయాత్రను ముగించారు. ఈ సందర్భంగా కొత్తూరి రవీందర్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ద్వారానే బానిస సంకెళ్లు తెగి స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు దొమ్మటి రవీందర్, నాయకులు కండె రవి, చిట్యాల శ్రీనివాస్, విద్యార్థి విభాగం మందపల్లి హరీశ్, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం

- అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి
- ప్రజావాణి దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- మేడారం మహాజాతరను విజయవంతం చేద్దాం
- గణతంత్ర వేడుకలో కలెక్టర్ ఇలా త్రిపాఠి



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పక్కన ఎస్పీ శబరీష్

ములుగు: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకరావాలని అన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని తంగేడు స్టేడియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్పీ డాక్టర్ శబరీష్‌తో కలిసి హాజరైన కలెక్టర్ ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు జాతీయ గీతాలపై చేసిన నృత్యాలను తిలకించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన చిన్నారులను అభినందించారు. జిల్లాలో వివిధ శాఖల తరపున ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. పౌరసరఫరాల శాఖ తరపున వానాకాలం ధాన్యం కొనుగోలు చేయడానికి జిల్లా వ్యాప్తంగా 164 కేంద్రాలను ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరతో ఎలాంటి తరుగులేకుండా 86వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రైతులకు రూ.80.8 కోట్లు చెల్లించినట్లు తెలిపారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్

ప్రజాపాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 174 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించామని అన్నారు. 2023 డిసెంబర్ 28వ తేదీ నుంచి 2024జనవరి 6వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 99,364 దరఖాస్తులు రాగా ప్రతి దరఖాస్తుదారుడికి రశీదులు అందిచామని తెలిపారు. అనంతరం ప్రతి దరఖాస్తులోని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని అన్నారు.

'మేడారం' విజయవంతం చేద్దాం

ఫిబ్రవరి 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరగనున్న మేడారం మహాజాతరను విజయవంతం చేస్తామని కలెక్టర్ అన్నారు. అధికారులు సమన్వయంతో జాతర విజయవంతానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.75కోట్లతో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష నిర్వహించి పనులు త్వరగా పూర్తి చేసేలా ఆదేశాలు ఇస్తూ.. అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, ఓఎస్డీ అశోక్ కుమార్, ఆర్డీఓ సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



జాతీయ జెండాతో విద్యార్థిని

నృత్యం చేస్తున్న విద్యార్థినులు



జెండా ఎగురవేస్తున్న ఎస్పీ శబరీష్

జిల్లా కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలు

జిల్లా కేంద్రంలోని పలు కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జెండాలను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాజ్యాగ నిబంధనలు పాటిస్తూ హక్కుల కల్పనకు కృషి చేయాలని అన్నారు. ప్రజలకు అధికారులు జవాబుదారీ తనంతో ఉండాలని తెలిపారు. ములుగు



జెండా ఎగురవేస్తున్న డీఎంహెచ్ఓ అప్పయ్య



జెండాకు వందనం చేస్తున్న ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి

గిరిజనుల అభ్యున్నతికి పాటుపడుతాం

గణతంత్ర వేడుకలో ఐటీడీఏ పీఓ అంకిత్



మాట్లాడుతున్న అంకిత్

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని గిరిజనుల అభ్యున్నతికి పాటుపడుతామని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో గణతంత్ర వేడుకలో భాగంగా జాతీయ జెండాను పీఓ ఎగురవేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ గౌరవ వందనంతో పీఓను స్టేజీ వరకు స్వాగతించారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం చేశారు. అసందర్భంగా పీఓ మాట్లాడుతూ.. ఐటీడీఏ ద్వారా చేపట్టిన పథకాలను వివరించారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక సంస్కృతి సంప్రదాయాలతో జీవిస్తున్న గిరిజన తెగలను విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తూ ఆరోగ్య సంరక్షణ చర్యలను విస్తృత పరిచివారి జీవన ప్రమాణాలను పెంచేందుకు ఐటీడీఏ కృషి చేస్తోందన్నారు. మేడారం జాతర సందర్భంగా 21 శాఖలతో రూ.75కోట్ల అంచనాతో పనులు చేపట్టినట్లు తెలిపారు. విద్యావిభాగం ద్వారా ఉమ్మడి వరంగల్ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల, కళాశాలలు తదితర విద్యాసంస్థల ద్వారా చదువుకుంటున్న 25,572 వేల మంది విద్యార్థులకు ప్రత్యేక బోధన కార్యక్రమాలు, భోజనం, వసతి, మౌలిక సౌకర్యాలు చేపట్టామన్నారు. ఒగ్లాపూర్‌లో ఉన్న గిరిజన డిగ్రీ కళాశాలను ఏటూరునాగారానికి తరలించామన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ

జిల్లా ఆస్పత్రి, మూడు సామాజిక ఆస్పత్రులు, 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య సేవలను విస్తృతం చేశామన్నారు. ఎంసీహెచ్, ఎపిడమిక్ స్కీం ద్వారా ఏప్రిల్ 2023 నుంచి డిసెంబర్ 23 వరకు 1473 వైద్య శిబిరాలు నిర్వహించి 69,492 మందికి స్క్రీనింగ్ టెస్టులు చేయించినట్లు తెలిపారు. మూడు ఉచిత అంబులెన్సుల ద్వారా 3,973 మందికి వైద్య సేవలు అందించామన్నారు. ఎడ్యుకేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఆర్టికల్ 275 ద్వారా గిరిజన భవనాలు, ఎస్ఆర్‌హెచ్ఎం, బీటీ రోడ్లు, స్కూల్స్, వసతి గృహాల మరమ్మతులు రూ.528.44కోట్లతో చేపట్టామన్నారు. రూ.3.50 లక్షలతో నితి అయోగ్ పథకం ద్వారా 117 అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులు, సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ట్రైకార్ ద్వారా 2020-21, 2021-22 సంవత్సరంలో 67,961 మంది యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకోగా అందులో పరిశీలించి 3,318 మందికి రూ.2,879.34 లక్షల సబ్సిడీని అందజేశామన్నారు. ఎంఎస్ఎంఈ ద్వారా జాయింట్ గ్రూపు సభ్యులకు ఇటుకల తయారీ, సెంట్రింగ్ యూనిట్లు, కాంక్రీట్ మిక్సర్లు, ఫుడ్ ట్రక్ లతో కలిపి 12 యూనిట్లు ఇచ్చామన్నారు. అలాగే జాకారం, ఏటూరునాగారంలోని వైటీసీల ద్వారా 409 మందికి వివిధ విభాగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చామన్నారు. ఈనెల 20 జాకారంలో జాబ్‌మేళా నిర్వహించి, 562 మందికి ఉపాధి కల్పించామని చెప్పారు. గిరిజన మత్స్యపారిశ్రామిక అభివృద్ధికి సొసైటీలను ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 15 ఏజెన్సీ మండలాల్లో 814 చెరువులుండగా 101 సొసైటీలను రిజిస్ట్రేషన్ పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం ద్వారా 1.78 కోట్ల చేప పిల్లలను ఉచితంగా సొసైటీలకు అందించినట్లు పీఓ వెల్లడించారు. 3 రిజర్వాయర్లలో 4.38 లక్షల రొయ్యలను పెంచడానికి విడుదల చేశామన్నారు. గిరివికాసం ద్వారా 3,018 మంది లబ్ధిదారులకు రూ.854.98లక్షలతో బోర్‌వెల్స్, మోటార్లు, ట్యూబ్ వెల్స్ ఇచ్చామన్నారు. గిరిజన సహాయ నిధి కింద 476 మంది గిరిజనులకు రూ.51.17లక్షలు చెక్కుల రూపంలో అందజేశామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 53,292మంది పోడు రైతులకు పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ద్వారా 2023లో రూ.5.20 లక్షల విలువ గల అటవీ ఉత్పత్తులను సేకరించామని పీఓ తెలిపారు.



జాతీయ జెండాను ఎగురవేస్తున్న పీఓ అంకిత్

బహుమతుల ప్రదానం

ఐటీడీఏ పరిధిలో ఉత్తమంగా సేవలు అందించిన వారికి ఈసందర్భంగా ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, డీడీ పోచం, తహశీల్దార్ ఖాజామొహినొద్దీన్, సీఐ రాజు, ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, ఏఓ దామోదరస్వామి, ఎస్ఓ రాజ్‌కుమార్, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.60లక్షలు గోల్‌మాల్

- పాలంపేట జీపీలో నిధులు పక్కదారి
- తీర్మానాలు లేనివైనం

వెంకటాపురం(ఎం): మండలంలోని పాలంపేట గ్రామపంచాయతీ కార్యాలయానికి చెందిన రూ.60 లక్షల నిధులు పక్కదారిపట్టినట్లు అధికారుల తనిఖీలో వెలుగుచూసింది. డీఎల్‌పీఓ స్వరూపారాణి శుక్రవారం పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాలకవర్గం తీర్మానాలు లేకుండా గ్రామపంచాయతీకి చెందిన రాష్ట్ర, కేంద్ర ఆర్థిక సంఘం, సాధారణ నిధులు సుమారు రూ.60లక్షలు సర్పంచ్ దుర్వినియోగం చేసినట్లు వెల్లడైంది. రూ.60 లక్షలు ఎందుకోసం ఖర్చుచేశారో.. తగిన ఆధారాలతో మూడు రోజుల్లోగా సమర్పించాలని సర్పంచ్ డోలి రజితకు డీఎల్‌పీఓ స్వరూపరాణి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ విషయమై సర్పంచ్ డోలి రజితను వివరణ కోరగా తాను ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని కొంతమంది కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. చేసిన ప్రతి పనికి బిల్లులు ఉన్నాయని పేర్కొన్నారు.



విచారణ చేపడుతున్న డీఎల్‌పీఓ స్వరూపారాణి

సమరయోధుల త్యాగఫలమే స్వేచ్ఛాజీవనం

గణతంత్ర వేడుకలో మంత్రి సీతక్క

ములుగు: సమరయోధుల త్యాగఫలితంగానే మన స్వేచ్ఛా జీవనం అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ నీటిపారుదల శాఖ మంత్రి సీతక్క అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంతోపాటు గాంధీపార్క్, డీసీఎం యూనియన్ కార్యాలయం ఎదుట జాతీయజెండాను ఎగురవేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు పారదర్శక పాలన అందిస్తుందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు అమలు చేశామని తెలిపారు. మిగతా పథకాలను అనుకున్న సమయంలో అమలు చేస్తామని అన్నారు. మహిళలు, బాలికల సంక్షేమానికి కట్టుబడి మహాలక్ష్మీ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అవకాశం కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, పట్టణ అధ్యక్షుడు చింత నిప్పుల భిక్షపతి, మండల అధ్యక్షుడు అహ్మద్‌పాషా, అశోక్, జక్కుల రేవంత్, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న మంత్రి సీతక్క

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు జిల్లా విద్యార్థులు

ములుగు రూరల్: ములుగు జిల్లా నుంచి సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఏటూరునాగారం మండలం రామన్న గూడెం ఉన్నతపాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికై నట్లు జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ తెలిపారు. ఈ నెల 22 నుంచి 24వరకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆన్‌లైన్‌లో ఎంపిక చేసినట్లు శుక్రవారం వెల్లడించారు. రామన్నగూడెం ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు గ్రూప్ ప్రాజెక్టుకు మైథిలి, రక్షితలు ఎంపికకాగా.. అదే పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి మనీష్ సింగిల్ ప్రాజెక్టుకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 28న విజయవాడలో నిర్వహించే సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు.



మైథిలి, రామన్నగూడెం ఉన్నత పాఠశాల



మనీష్, రామన్నగూడెం ఉన్నత పాఠశాల

జాతర పనులన్నీ త్వరగా పూర్తి చేయాలి

మేడారంలో పనులను పరిశీలించిన మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జాతర పనులన్నీ ఈనెలాఖారుకల్లా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మేడారంలో జరుగుతున్న జాతర పనులను శుక్రవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్‌లతో కలిసి మంత్రి సీతక్క ఆకస్మికంగా తనిఖీ చేశారు. మేడారంలో వీఐపీ పార్కింగ్ స్థలం, ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జంపన్నవాగులోని ఏర్పాట్లను పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. కొత్తూరు ప్రాంతంలోని తాత్కాలిక జీఐ షీట్స్ మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. అనంతరం కన్నెపల్లిలోని సారలమ్మ గుడిని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. సారలమ్మ పూజారి కాక రంజిత్ సారలమ్మ గుడి సమీపంలో మరుగుదొడ్లు, తాగునీరు, లైటింగ్ ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్కను కోరగా అన్నీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్అండ్‌బీ రోడ్డు పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అదేశించారు. ఈసందర్భంగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేనటువంటి విధంగా డబ్బులు చెల్లించకుండా దైవ దర్శనం జరిగే ప్రసిద్ధ ఆలయ ప్రాంతం మన మేడారమని అధికారులు పనులు నాణ్యతలో ప్రమాణాలు పాటిస్తూ సకలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ అంకిత్, అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీజ, డీఎస్పీ రవీందర్, ఈఓ రాజేంద్రర్, డీపీఓ వెంకయ్య, పీఆర్ ఈఈ అజయ్ కుమార్, పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.



పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నేడు సెమినార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, తెలంగాణ ప్రభుత్వ ఈఎఫ్ అండ్ టీ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా ఈనెల 27న 'ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ కెరీర్స్ ఇన్ ఐపీఆర్ అవేర్‌నెస్' అంశంపై సెమినార్ నిర్వహించనున్నారు. పరిపాలనా భవనం సెనేట్‌హాల్‌లో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సెమినార్‌లో కేయూ వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు పాల్గొంటారు. 'ఇంపార్టెన్స్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్ ఫర్ అకాడమీ' అంశంపై హెడ్ లీగల్ అండ్ ఐపీఆర్ సుభాజిత్‌సాహా ప్రసంగిస్తారు.

కేయూలో నేడు ఓరియంటేషన్ ప్రోగ్రాం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో డిగ్రీ (బీకాం, బీబీఏ) అధ్యాపకులకు రిపోర్టు రైటింగ్‌పై ఈనెల 27న ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు కళాశాల బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య కట్ల రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల సెమినార్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి వీసీ ఆచార్య తాటికొండ రమేష్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, విభాగం అధిపతి ఆచార్య ఎస్.నర్సింహాచారి, డీన్ ఆచార్య పి.అమరవాణి, ఆచార్య పి.వరలక్ష్మి, అడ్జెంట్ ఆచార్యులు కృష్ణమాచార్యులు పాల్గొంటారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

గూర్ఖాకు దాతల చేయూత


రాణాకు నగదు అందజేస్తున్న దాతలు

సాక్షి స్పందన

డోర్నకల్ : డోర్నకల్‌లో గూర్ఖాగా పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన డమ్మర్ రాణా గుండె జబ్బు చికిత్స కోసం దాతలు చేయూతనందిస్తున్నారు. పేదరికానికి తోడు గుండె జబ్బు బారిన పడటం, నేపాల్ దేశస్థుడు కావడంతో రేషన్ కార్డు లేక చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత లేక పోవడంతో ఇటీవల సాక్షి దినపత్రికలో గూర్ఖాకు గుండె జబ్బు పేరుతో కథనం ప్రచురితం కాగా దాతలు స్పందిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం వరంగల్‌కు చెందిన న్యాయవాదులు రూ.5 వేల నగదు అందించారు. శుక్రవారం డోర్నకల్ జెడ్పీఎస్ఎస్ 2005-06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు డమ్మర్ రాణా ఇంటికి వచ్చి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వీరబోయిన రమేష్, సీహెచ్ రవి, భూక్యా రాజేష్, ఎల్.విజయ్, జక్కుల నరేష్, ఎస్‌కె రేష్మా, ధరావత్ రేష్మా, రాధిక తదితరులు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య


గట్టయ్య మృతదేహం

మడికొండ : గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మడికొండ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన దండింగం గట్టయ్య(70) అనారోగ్యంతో పాటు అప్పులు అధికమయ్యాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన గట్టయ్య శుక్రవారం మడికొండ శివారు ఇండస్ట్రీయల్ ఏరియాలో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల రాజబాబు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఉత్తములకు ప్రశంస


డీపీఆర్ఓ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ శంకర్‌కు ప్రశంస పత్రం అందజేస్తున్న కలెక్టర్

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రశంస పత్రాలు అందజేశారు. జిల్లా కేంద్రంలోని తంగేడు స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ డాక్టర్ శబరీష్ అధికారులకు ప్రశంసా పత్రాలను అందించారు. ఇదిలా ఉండగా.. మేడారం జాతర సందర్భంగా పోలీస్ శాఖ తరఫున ఇటీవల నిర్వహించిన వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇదిలా ఉండగా.. ఐటీడీఏ పరిధిలోని ఉత్తమ ఉద్యోగులకు పీఓ అంకిత్ ప్రశంస పత్రాలు అందజేశారు. - ములుగు


జీసీడీఓ సుగుణకు ప్రశంస పత్రం అందజేస్తున్న ఐటీడీఏ పీఓ అంకిత్


ప్రవీణ్‌కుమార్ ఎంపీడీఓ | కమలాకర్, డీసీఆర్బీ ఎస్సై | కుమారస్వామి, ఏఎస్సై | లక్ష్మీనారాయణ, హెడ్ కానిస్టేబుల్ | విక్రమ్ కానిస్టేబుల్ | దేవేందర్ ఈ-డిస్ట్రిక్ మేనేజర్ | ప్రసాద్ కలెక్టరేట్ ఏఓ | రాజ్ ప్రకాశ్ కలెక్టరేట్ సూపరింటెండెంట్ | అజిత్ పీఆర్ ఏఈ | విజేందర్ ఆర్ఐ | కల్యాణి, ఏఓ | ప్రభాకర్, ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది


సాయి, ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది | అనసూయ, అంగన్‌వాడీ టీచర్ | డాక్టర్ పవన్ కుమార్ | రాజ్‌కుమార్, ఐటీడీఏ, ఎస్ఓ | తోట రవీందర్, తహసీల్దార్ | వంశీ, జేఎల్ఎం | కోడి రవీందర్, ఏసీఎంఓ, ఐటీడీఏ | శ్రీనివాస్, ఐటీడీఏ మేనేజర్ | వెంకన్న, ఎస్‌డీసీ | రాజు, ఇన్‌స్పెక్టర్ | ఆదినారాయణ, స్పోర్ట్స్ ఆఫీసర్ ఐటీడీఏ | అనిల్, మిషన్ భగీరథ అసిస్టెంట్


జబ్బార్, డీటీ | అనిల్, వైద్యాధికారి | రమాదేవి, జీపీ కార్యదర్శి | రాజయ్య, సఫాయి, ఏటూరునాగారం | మాధవి, ల్యాబ్ టెక్నీషియన్ | రవి, ట్రాన్స్‌కో లైన్ మెన్ కమలాపురం | అనిల్, డీటీ ఆర్ఓఎఫ్ఆర్ | బహుమతి అందుకుంటున్న విద్యార్థిని


ఏటూరునాగారంలో జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారులు

ప్రాణం మీదికి తెచ్చిన క్షణికావేశం

- సమక్క జాతరలో వర్కర్ల మధ్య గొడవ
- బార్ యజమాని బంధువు మందలింపు
- పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం
- 80శాతం కాలిన శరీరం.. పరిస్థితి విషమం

ఎస్ఎస్‌తాడ్వాయి/ఖిలా వరంగల్: విహార యాత్ర విషాదంగా మారింది. మద్యం మత్తులో వర్కర్ల మధ్య చోటుచేసుకున్న స్వల్ప ఘర్షణ.. బార్ యజమాని బంధువు మందలింపు.. ఓ వ్యక్తి ఆత్మహత్య యత్నానికి దారితీసింది. ములుగు జిల్లా మేడారం జాతరలో శుక్రవారం జరిగిన ఘటన వివరాలు స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండకు చెందిన మడిపెల్లి సతీష్(28) కొంతకాలంగా వరంగల్ కరీమాబాద్‌లోని ఓ బార్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా వర్కర్ల అభ్యర్థన మేరకు శుక్రవారం తెల్లవారు జామున బార్ యజమాని ఓ వాహనంలో వర్కర్లను సమ్మక్క,సారలమ్మ దర్శనానికి పంపించారు. వారి వెంట బార్ యజమాని బంధువు కత్తి దేవేందర్ వెళ్లారు. ఉదయం అమ్మవార్ల దర్శనం అనంతరం మేక కోసి వంటలు చేసుకున్నారు. అందరు కలిసి మద్యం తాగుతుండగా.. అక్కడికి ఓ యాచకుడు రాగా.. అందరూ అతడిని తిట్టారు. తోటి వర్కర్ల తీరుపై అసహనం వ్యక్తం చేసిన సతీష్ భిక్షగాడికి రూ.50 అందజేశాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న వర్కర్లు.. సతీష్ మధ్య ఘర్షణ జరిగింది. దీంతో అక్కడే ఉన్న బార్ యజమాని బంధువు మందలించాడు. యజమాని బంధువు అయితే నన్ను తిడతాడా అంటూ మనస్థాపానికి గురైన సతీష్ భోజనం చేయకుండానే బయటకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించి 80శాతం కాలిన గాయాలైన సతీష్‌ను 108 వాహనంలో ములుగు ఆస్పత్రికి పంపించారు. వైద్యుల సూచన మేరుగైన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు చెబుతున్నారు.


ఎంజీఎంలో చికిత్స పొందుతున్న సతీష్

38లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 38.85లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు తెలిపారు. 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సింగరేణి ఆధ్వర్యంలో శుక్రవారం భూపాలపల్లి ఏరియాలో ఘనంగా నిర్వహించారు. జనరల్ మేనేజర్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని జీఎం ఆవిష్కరించారు. అనంతరం మిలినియం క్వాటర్స్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సింగరేణి సంస్థ దేశాభివృద్ధికి దిక్సూచిగా మరింత గుర్తింపు సాధించినట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 90శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు చెప్పారు. భూపాలపల్లి ఏరియాలో 38.85లక్షల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 25.77లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి 66శాతంలో నిలిచిందన్నారు. మిగిలిన రెండు నెలల కాలంలో సుమారుగా రోజుకు 21వేల టన్నుల చొప్పున బొగ్గు లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు.

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడి


పట్టుబడిన మద్యం బాటిళ్లను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

- మద్యం స్వాధీనం, నిర్వాహకులపై కేసు

ఖిలా వరంగల్ : అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్న బెల్ట్‌షాపులపై ఆకస్మికంగా దాడి చేసి రూ.1,80,440ల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, పెండ్యాల దేవేందర్ తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి శాకరాసికుంట కాలనీకి చెందిన ఎనుగందుల రాజు, మామునూరు స్టేషన్ పరిధి తిమ్మాపురం గ్రామశివారు లక్ష్మీపురానికి చెందిన నాగప్ప శివ వేర్వేరుగా తమ ఇంట్లో భారీగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నారని సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, పెండ్యాల దేవేందర్ ఆధ్వర్యంలో వేర్వేరుగా బెల్ట్‌షాపులపై దాడి చేశారు. ఈదాడుల్లో ఎనుగందుల రాజు ఇంట్లో సుమారు రూ.1,65,160ల విలువైన మద్యం బాటిళ్లు, లక్ష్మీపురం గ్రామానికి చెందిన నాగప్ప శివ ఇంట్లో రూ.15,280ల మొత్తం రూ.1,80,440ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని రాజు, శివపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ టి.సురేష్, మామునూరు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్‌కు వేర్వేరుగా అప్పగించారు.ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఈ.నర్సింహరావు, మామునూరు ఎస్సై కృష్ణవేణి, కానిస్టేబుళ్లు బావ్‌సింగ్, వీరన్న పాల్గొన్నారు. వరంగల్ మిల్స్‌కాలనీ ఏసీరెడ్డినగర్‌కు చెందిన గద్దం రమేష్ ఇంట్లో రూ.51,680ల విలువైన మద్యం, మామునూరు గ్రామానికి చెందిన సల్లూరి రాజేందర్ ఇంట్లో నిల్వ చేసిన రూ.26,440ల విలువ చేసిన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.

విద్యార్థినికి చేదు అనుభవం

- బస్సుల్లో తిరగడం అమ్మాయిలకు ఫ్యాషనైందంటూ మహిళా కండక్టర్ వెటకారం

పరకాల : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ సదుపాయం కల్పించడం ఏమో కానీ ఓ విద్యార్థికి మహిళా కండక్టర్ నుంచి చేదు అనుభవం ఎదురైంది. నడికూడ మండలం నర్సక్కపల్లెకు చెందిన విద్యార్థిని మేఘన పరకాల నుంచి హుజురాబాద్ వెళ్లే బస్సెక్కింది. అయితే ఉచిత ప్రయాణం కావడంతో విద్యార్థిని తన వద్ద ఉన్న ఆధార్ కార్డు చూపించింది.. దీంతో మహిళ కండక్టర్ ఫొటో మార్చుకుంటే ఏమవుతుంది.. చిన్నప్పటి కార్డు ఉందా అంటూ వెటకారంగా మాట్లాడింది. కాగా తాను అప్‌డేట్ చేసుకున్నానని చెప్పిన పట్టించుకోలేదని.. అలా మాట్లాడకండి అవసరమైతే డబ్బులు తీసుకొమ్మని చెప్పింది. పైసలు ఎక్కువైనాయా.. అయిన కాలేజీ అమ్మాయిలకు పనిపాట లేకుండా బస్సులో తిరగడం ఫ్యాషనైందనడంతో బస్సులోనే ఆ విద్యార్థి కంటతడి పెట్టుకుంది. ఈ విషయాన్ని తన తండ్రికి ఫోన్‌లో తెలియజేయగా అతను పరకాల ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు డిపోకు చేరుకున్నాడు. డీఎం కొత్త బస్సుల ప్రారంభోత్సవం బిజీగా ఉండటంతో అక్కడే ఉన్న కొందరు ఆర్టీసీ ఉద్యోగులు మరోసారి అలా జరగకుండా చూసుకుంటామంటూ నచ్చజెప్పారు. అయితే ఓ వైపు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కొత్త బస్సులు ప్రారంభిస్తుండగా ఈ సంఘటన జరగడం విశేషం. ఈ విషయంపై ఆర్టీసీ డీఎం రవిచంద్ర దృష్టికి సాక్షి తీసుకెళ్లగా ఆధార్ అప్‌డేట్ చేసుకొమ్మని చెప్పడంలో తప్పులేదన్నారు. బాలిక ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

16 కిలోల గంజాయి స్వాధీనం


నిందితుడితో పాటు పట్టుబడిన గంజాయిని చూపుతున్న సీఐ చంద్రమోహన్

- నిందితుడి అరెస్ట్

కాజీపేట : కాజీపేట రైల్వే జంక్షన్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని తనిఖీ చేయగా అతని వద్ద 16కిలోల ఎండుగంజాయి లభ్యమైందని ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. రైలు ద్వారా ఒడిశా రాష్ట్రం నుంచి నిషేధిత గంజాయి రవాణా చేస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం రైల్వే స్టేషన్‌లో మకాం వేసి నిందితుడు సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయిని సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో ఎస్సై తిరుపతి, హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్, కోటి, వీరమల్లు, రవీందర్, లాలయ్య, ఆయుబ్ పాల్గొన్నారు.

నేటినుంచి అన్నారం దర్గా ఉర్సు

- మూడు రోజుల పాటు సాగనున్న ఉత్సవాలు
- రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తుల రాక


విద్యుత్ దీప కాంతుల్లో దర్గా

పర్వతగిరి : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో హజ్రత్ సయ్యద్ యాకూబ్ షావలి బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు నేటినుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి దర్గాను దర్శనం చేసుకోనున్నారు. ఉర్సు ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు(శనివారం) రాత్రి ఖవ్వాలి గేయాలాపన, గంధం ఊరేగింపు, రెండో రోజు (ఆదివారం) దీపారాధన, భక్తులకు మహా అన్నదానం, మూడో రోజు(సోమవారం) ఖత్మల్ ఖురాన్‌లతో ఉత్సవాలు ముగుస్తాయి. దర్గాకు ముస్లింలతో పాటు హిందువులు హాజరై మొక్కులు చెల్లించుకుంటారు.

ఉత్సవాలకు నిధుల మంజూరు



అన్నారం దర్గా ఉర్సు ఉత్సవాలకు తెలంగాణ వక్ఫ్‌బోర్డు నుంచి రూ.7.10లక్షలు మంజూరయ్యాయి. దర్గాతో పాటు చిల్లాల పెయింటింగ్, తాగునీరు, శానిటేషన్, మరుగుదొడ్లతో పాటు అన్నదానం, ఇతర సదుపాయాలకు కేటాయించి ఏర్పాట్లు పూర్తి చేశాము.

-రియాజ్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్

భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాం..



అన్నారం దర్గా ఉర్సు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాం. యాకూబ్ బాబా అనుగ్రహంతో ప్రతీ ఏటా బాబాకు గంధం సమర్పించేందుకు ముజేవార్ల ఇంటి నుంచి గంధాన్ని తీసుకెళ్తారు. గంధం తీసుకెళ్లే సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి దర్గాలో గంధం సమర్పిస్తాం.

-ఖాజాపాషా, ముజేవార్

పోలీసుల బందోబస్తు



గంధం ఊరేగింపునకు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశాం. భక్తులను క్యూలో నిలబెట్టడానికి, ట్రాఫిక్ మళ్లింపు, వాహనాల పార్కింగ్, దొంగతనాల నివారణకు క్రైం పార్టీ, గంధం ఊరేగింపునకు స్పెషల్ పార్టీ పోలీసులు విధులు నిర్వహిస్తారు. దర్గా వద్ద కంట్రోల్ రూం ఏర్పాటు చేసి బందోబస్తు పర్యవేక్షణ చేయడం జరుగుతుంది. భక్తులు, ఉత్సవ నిర్వాహకులు, పోలీసులకు సహకరించాలి.

- వీరభద్రరావు, ఎస్సై

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడి మృతి


గోపాల్ (ఫైల్)

చిల్పూరు: మండలంలోని పల్లగుట్టకు చెందిన గీతకార్మికుడు ఉమ్మగోని గోపాల్(52) శుక్రవారం వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై వినయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. గీత వృత్తే ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్న గోపాల్ రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు వెళ్లాడు. చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారడంతో కిందపడి తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. కాగా కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గణగోని రమేష్, గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు చిర్ర నాగరాజు, వెంకటేశ్వర్లుతో పాటు పలువురు నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరఫున రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని వారు కోరారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్..


సురేష్(ఫైల్)

నర్సింహులపేట : మండలంలోని బొజ్జన్నపేట గ్రామ పరిధిలో శుక్రవారం ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో డ్రైవర్ మృతిచెందాడు. ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలంలోని సింగారం గ్రామానికి చెందిన చెరుకు సురేష్(30) బొజ్జన్నపేట గ్రామ పరిధి నుంచి ట్రాక్టర్‌లో మట్టిని తరలిస్తున్నాడు. ఈక్రమంలో కాల్వ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో సురేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య శ్రావణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు.